# లోకం....!?

## పాలపర్తి జ్యోతిష్మతి

చిన్నప్పుడు బామ్మను 'లవకుశ' సినిమాకు తీసుకెళ్ళినప్పుడు తనకెంత గర్వంగా అనిపించింది! అమ్మా, నాన్నా, అక్కా ఎందుకు రాలేదో గుర్తులేదు కానీ, బామ్మ తనను "నన్ను లవకుశ సినిమాకు తీసుకెళ్ళరా' అని అడగడం, తామిద్దరమే ఆ సినిమాకు వెళ్ళడం మాత్రం బాగా గుర్తుంది. సినిమా చూసినప్పుడు బాగానే ఉంది కానీ తరువాత ఎన్ని సందేహాలో ! ఆరోజు రాత్రి బామ్మ పక్కన పడుకుని తన అనుమానాలన్నీ అడిగేశాడు.

'రాముడు సీతను అడవులకు ఎందుకు పంపాడు? రాముడు ఏడుస్తూనే పంపాడు. లక్ష్మణుడు ఏడుస్తూనే తీసుకెళ్లాడు. సీత కూడా చాలా బాధ పడింది. ఒక్క చాకలివాడు అన్న మాటను పట్టుకుని అందరూ బాధపడాలా?' అని.

'లోకంరా, లోకం ! మనం చేసే ప్రతి పనినీ లోకం వెయ్యికళ్లతో గమనిస్తూ ఉంటుంది. లోకంలో ఏ ఒక్కరూ మనగురించి చెడుగా అనుకోకూడదు. అట్లా వుండాలి మన ప్రవర్తన.' అని బామ్మ చెప్పిన మాటలు తనపై ఎంత ప్రభావం చూపించాయి ! అప్పట్నించీ తను ఏ పనికైనా ముందు లోకం గురించి ఆలోచించడం అలవాటు చేసుకున్నాడు. ఇవాల్టికీ తనది అదే పద్ధతి. కానీ అక్కడే వస్తోంది తనకు తన భార్యతోటీ కూతురితోటీ గొడవ.

'ఆ వాలుజడా, నైలెక్స్ చీరలూ ఏమిటీ? చూసేవాళ్ళేమనుకుంటారు? ముడి పెట్టుకుని, నేత చీర కట్టుకుని మన సంప్రదాయానికనుగుణంగా వుండు' అంటాడు తను. 'ఎవరో ఏదో అనుకునేలా ఏం తయారవ్వట్లేదు నేను. నా వయసు వాళ్ళంతా ఎట్లా ఉంటున్నారో అట్లానే వుంటున్నాను' అంటుంది రాధ. 'ఎవరెట్లా ఉన్నారు అని కాదు; అందరూ ఏమనుకుంటారు అని ఆలోచించా'లంటాడు తను.

సంధ్యను మాత్రం ఏమన్నాడు తను? నెత్తిమీద అదేదో పెట్టుకుంది. 'ఏంటమ్మా అది? బాగాలేదు. తీసెయ్యి' అన్నాడు. అంతేగా ! తను సంధ్యకు గానీ, రాధకు గానీ ఏంచెప్పినా నిదానంగా, మంచిగానే చెప్తాడు. కోపంగా మాట్లాడడం, అరవడం ఎప్పుడూ ఉండదు. కానీ సంధ్య ఎంత విసుగ్గా సమాధానం చెప్పింది? 'హెయిర్‌బాండ్ అంటారు దీన్ని. బాగుండటంకోసం పెట్టుకోరు. బండిమీద వెళ్తుంటే జుట్టు ఎగిరి కళ్లలో పడకుండా అణిచిపెట్టి ఉంచడం కోసం పెట్టుకున్నాను' అంది. కానీ తనకు అది నచ్చలేదు. 'అది పద్ధతి కాదమ్మా, సాంప్రదాయికంగా ఉండాలి. వారం క్రింత వెంకట్రావు కూతుర్ని ఆఫీసుకు తీసుకొచ్చాడు. పుట్టినరోజట, చాక్లెట్లు ఇప్పించడానికి. పదేళ్ల పిల్ల. పట్టులంగా జాకెట్టూ వేసుకుని, రెండు జడల్లో పూలు పెట్టుకుని ముచ్చటగా వుంది. అందరూ ఎంతో మెచ్చుకున్నారు 'చక్కగా సంప్రదాయబద్ధంగా తయారయింది' అని. వాళ్ళు ఇప్పుడు నిన్నిట్లా చూశారనుకో, 'ఎంత స్టయిల్‌గా తయారయింది' అనుకోరా?' అన్నాడు తను. అంతే! గయ్‌మని లేచింది. 'ఈకాలంలో పిల్లలెవరూ లంగాజాకెట్టూ, జడలూ వేసుకోవట్లేదు. అందుకని ఆ అమ్మాయిని చూసి అందరూ ముచ్చటపడి వుండొచ్చు. అంతమాత్రాన వాళ్ళు నన్ను ఎత్తి చూపినట్టు అర్థం చేసుకోనక్కర్లేదు. అట్లా అనుకుంటే అది వాళ్ల భార్యాపిల్లలకి కూడా వర్తిస్తుంది. అయినా హెయిర్ బాండ్‌కీ సంప్రదాయానికీ సంబంధం ఏంటి నాన్నా? ఇదొక కన్వీనియన్స్. అంతే. అయినా ప్రతి దానికీ సంప్రదాయం, సంప్రదాయం అనుకునే వాడివి బండెందుకు కొనిపెట్టావు నాకు? సిటీబస్సులో వెళ్ళేదాన్నిగా కాలేజీకి?" అంటూ ఇంతెత్తున ఎగిరింది. బస్సులో వెళ్తే ఆకతాయి కుర్రాళ్ళతో ఎక్కడ ఇబ్బంది పడుతుందో అని తన భయం. 'బస్సులో యాభైమంది ఉంటే ఎవరికీ రాని ఇబ్బంది నాకే వస్తుందా? ఏ వాతావరణంలో ఎట్లా మసులు కోవాలో నాకు తెలుసు. నేనేం పసిపిల్లను కాను' అంది.

బస్సులో సీటు దొరక్కపోతే నిలబడలేక మగాళ్ళ పక్కన కూర్చుంటే, ముందు చూసిన వాళ్ళేమనుకుంటారో అని తన భయం.

'ఎక్కడ కూర్చోవాలో, ఎవరికి ఎంత దూరంలో ఉండాలో నాకు తెలీదా? ఇవాళ ఆడపిల్లలు ఒంటరిగా అమెరికా, ఆస్ట్రేలియా వెళ్ళి చదువుకుంటున్నారు, ఉద్యోగాలు చేస్తున్నారు. నన్ను బస్సులో కాలేజీకి పంపడానికి ఇంత ఆలోచిస్తావేంటి?' అని విసుక్కుంది. దాని మాటలకి తనెంత బాధపడ్డాడు ?

రాధ ఎంత తెలివిగా మాట్లాడింది, తనని సమర్థిస్తోందో వ్యతిరేకిస్తోందో అర్థం కాకుండా ! 'దాని మాటలకి అంత బాధపడతారెందుకు? ఆ వయసులో అటువంటి ఆవేశం సహజం. మనపిల్లే కదా ? దాని మాటలకి మనం సీరియస్ అవకూడదు' అంటూనే 'అయినా అది అన్నదాంట్లో మాత్రం తప్పేముంది? ఎంతసేపూ మనరక్షణలోనే ఉంచుకోవాలనుకుంటే ఎట్లా? దాని వ్యక్తిత్వం దానికి ఉంటుంది. దాని స్నేహితురాళ్ళు దాన్ని ఏం ఆటపట్టిస్తున్నారో? దానివైపు నుంచి కూడా ఆలోచించాలి మనం' అని కూతుర్ని వెనకేసుకొచ్చింది.

'అట్లా ఆటపట్టించే వాళ్ళతో స్నేహం చెయ్యక్కర్లేదు. వాళ్ళేం వెధవ్వేషాలేస్తున్నారో, వాళ్ళ గురించి ఎవరేమనుకుంటున్నారో, మనకేం తెలుసు?' అన్నాడు తను.

'నా ఫ్రెండ్స్‌ని ఏమీ అనకు. వాళ్ల గురించి ఎవ్వరూ ఏమీ అనుకోరు' అంటూ మళ్ళీ ఎగిరిపడింది సంధ్య.

'ఎంతసేపూ వాళ్ళేమనుకుంటారో, వీళ్ళేమనుకుంటారో అని భయపడుతుంటే మన జీవితాలు మనవి కాకుండా పోతాయి. ఎవరేం మాట్లాడినా దాన్ని మనకి అన్వయించుకుని ముడుచుకుపోనక్కర్లేదు. అందర్నీ మెప్పించడం ఎవరివల్లా కాదు. మనకి

నచ్చినవిధంగా మనముంటాం' అంటారు వాళ్ళు.

అప్పుడు చెప్పాడు తను వాళ్ళకు – అసలు తను ప్రతి విషయానికీ లోకం గురించి ఆలోచించడం ఎప్పుడు ఎట్లా మొదలైందో. అంతే ఇద్దరూ విరుచుకు పడిపోయారు తనమీద. 'త్రేతాయుగం నాటి పద్ధతుల్నే ఇప్పుడూ పాటించాలంటే కుదరదు. కాలంతో పాటూ సంప్రదాయాలు కూడా మారతాయి' అంటూ పెద్ద ఆరిందలా తనకే పాఠాలు చెప్పింది సంధ్య. ఇంక రాధ ఎడా పెడా తనని ఏకిపారేసింది. 'అవును మరి ! క్రాఫ్ చేసుకోవడం, ఫాంటూ, షర్టూ వేసుకోవడం, పొద్దున్నే పాచిమొహంతో కాఫీ తాగడం – ఇవన్నీ మన సనాతన సంప్రదాయాలనుకునే మీరు ఆచరిస్తున్నారు కాబోలు, పాపం !' అంటుంటే 'రాధలో ఇంత వ్యంగ్య వైభవముందా?' అని బిత్తరపోవడం తన వంతయింది. అంతటితో ఊరుకుందా ? 'మీరు పూజ చేసేదే సంవత్సరాని కొక్కరోజు – వినాయక చవితి నాడు. ఆ రోజు కూడా పట్టుపంచెనే లుంగీలా చుట్టబెట్టుకుంటారు గానీ పంచెకట్టు ఎప్పుడైనా కట్టారా? ఏం ? సంప్రదాయాలు ఉండేది ఆడవాళ్ళ కోసమేనా? మగవాళ్ళు వాటిని పట్టించుకోనక్కర్లేదా?' అంటుంటే ఏం మాట్లాడాలో తనకర్థం కాలేదు. కానీ లోకం గురించి ఆలోచించకుండా మన ఇష్ట ప్రకారం మనం ఉండాలనుకోవడాన్ని మాత్రం తను ఒప్పుకోలేక పోతున్నాడు.

తన ఆలోచనా విధానానికనుగుణంగా వీళ్ళని ఎట్లా మార్చుకోవాలా అని తను మధనపడుతుంటే నిన్న ఆఫీసులో వాళ్ళు తన గురించి ఏమనుకుంటున్నారు !

'ఆ సుబ్బారావు లోకం, సంప్రదాయం అంటూ పెళ్ళాం పిల్లల్ని తెగ కట్టడి చేస్తుంటాడు. వాళ్ల చుట్టూ గిరిగీసి తనేదో వాళ్ళని రక్షిస్తున్నాననుకుంటాడు.'

'ఆ ! లోకం, లోకం అంటాడు గానీ అసలు లోకమెట్లా ఉందో అతనికి తెలిస్తే కదా, అతనో త్రేతాయుగం నాటి మానవుడు. పెళ్ళాం పిల్లలు కూడా అట్లానే ఉండాలంటాడు.'

'భార్యనీ, కూతుర్నీ ఎవరేమనుకుంటారో, లోకమేమనుకుంటుందో అంటుంటాడు గానీ, వాళ్ల గురించి ఏమనుకుంటారు, ఎవరైనా ? మహా అనుకుంటే 'అతనితో ఎట్లా వేగుతున్నారో, పాపం !' అనుకుంటారు. కానీ తన గురించి లోకం ఏమనుకుంటుందో తెలుసుకోలేక పోతున్నాడు పాపం.'

నిజమేనా? తనే లోకవిరుద్ధంగా ఆలోచిస్తున్నాడా? మార్పు తనలోనే రావాలా? తనే లోకానికనుగుణంగా మారాలా?

మార్పుని జీర్ణించుకోలేకపోతున్న సుబ్బారావు నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు.

# నా పల్లె పరాయిదైపోయింది

ఈ భూమిలో పుట్టి
ఈ భూమిలోనే ఇంకిపోతున్న
బ్రతుకు చిత్రానికి
మౌన ప్రేక్షకుణ్ణి
నా వూరూ పేరూ పొలిమేరా చెదిరి
సెజ్ గుప్పిట్లో ఒదిగిపోయింది
నా పల్లె పరాయిదైపోయింది.

పంటభూములు ప్లాట్లుగా
రైతోడు పనోడుగా
కూలోడు వలసపక్షిగా
ఊరు వల్లకాడుగా
రూపాంతరీకరణ చెందినది
చెమట చుక్కల చిరుజల్లుకి
తడిసి పులకించిన పుడమితల్లి
కన్నీటి జడివానలో
తడిసి ముద్దవుతుంది

నా పల్లె పరాయిదైపోయింది
లూఠీ అవుతున్న గ్రామాన్ని
లాఠీలు పహారా కాస్తున్నాయి
కంచే చేను మేసినట్లు !
యంత్ర భూతముల
వికటాట్టహాసములతో
భూగోళం గుండె పగిలి
బ్రద్దలవుతున్న చప్పుడు !
జానపదుల జనపథాలు
సిరిమువ్వల సవ్వడులు
జోడెద్దుల పధనిసలు
అదృశ్యమౌతున్న ఆఖరిక్షణాలు !

అభివృద్ధి మంత్రానికి అవతల
మనిషి మాయమవుతుంటే
ఆత్మలు భూమి చుట్టూ
ఘోషిస్తూ పరిభ్రమిస్తున్నాయి !
ఎగుడు దిగుడుల పంటభూమి
బల్లపరుపుగా మారిపోయే దృశ్యం
ఇదొక మ్యాజిక్ 'రియలిజం'

గేటెడ్‌కమ్యూనిటీల గేట్లముందు
చితికిన నా చరిత్ర
సెక్యూరిటీగార్డుగా మిగిలిన సాక్ష్యం
నా కోసం ఆశతో ఎదురుచూస్తూ
ఉట్టిమీద ఉపాధి
ఊరవతల సమాధి !
నా పల్లె పరాయిదైపోయింది !!

పల్లె వాసనలేని
గ్లోబల్ విలేజి కల్చర్‌లో
హార్ధికం లేని ఆర్థిక సూత్రాలు
విస్ఫోటనాలు సృష్టిస్తున్నాయి
బడుగు జనుల విస్థాపనపై
ఐటి రంగ వికాసం
అంతర్జాతీయ వేదికల మీద
ఆర్భాటంగా వెలిగిపోతున్న వైనం
భూ నిర్వాసితులు
ఆకలి మంటల్లో
ఆహుతై పోతున్న దైన్యం
ధరాదిపతుల దళారితత్వం
పరాయిపాలన వారసత్వం !

రెక్కలు తెగిన విహంగాన్ని
గూడు చెదిరిన కపోతాన్ని చూసి
దయతలచే సిద్ధార్థుడు కాదు
దారి చూపే 'షహీద్'లు కావాలి
"సెజ్" సర్పాల పడగనీడల్లో
నా పల్లె బిక్కు బిక్కుమంటోంది.
పాలు పోసి పూజించడం మాని
కోరలు పీకి ఆడించాలి !
అది విష జంతువు గద !
అందుకే ఆయుధం కావాలి !!

– డా॥ జి.వి.కృష్ణయ్య